# "అన్నమంటేంది? పరబ్రహ్మ స్వరూపం...!"

ఎప్పుడన్న అన్నంగిన్నెకు గాని, పుస్తకానికి గాని కాలు దాకుతె "మొక్కు బిడ్డ మొక్కు, గట్ల కాల్దాకియ్యద్దు. అన్నం గిన్నెకు కాల్దాకిత్తె అన్నం దొరుకది. పుస్తకమంటె సరస్వద్దేవి. పుస్తకాన్ని తంతె సదువు రాదు. కండ్లకద్దుకో" అనెటోడు మా నాయిన్న. నేను సెయ్యని వాటికి తాకిచ్చి కండ్లకద్దుకునెటోన్ని. గా అలువాటు నాకు గిప్పటిగ్గాడ అట్లనే ఉంది.

ఓనాడు సాయమాండ్ల[44] కూసోని నేను, నాయిన అన్నం తింటన్నం. నా సోపతికాడు సెంద్రమొగిలచ్చి అరుగుమీన కూసున్నడు. నేను జెప్పజెప్పన అన్నం దిని గిన్నెల్నే దవ్వద్వ సెయ్యి కడుక్కున. తడిసెయ్యని లుంగికి తుడుసుకుంట అరుగుమీనికచ్చిన. దవ్వదవ్వ బేలేసెటప్పడన్నం గిన్నెకు నా కాల్దాకింది. నాయిన్న అగ్గురమైన మంటకచ్చిండు.

"అన్నమంటేందనుకున్నవుర! అన్నం పరబ్రమ్మం. అన్నాన్ని తంతె తినుటానికన్నం దొరుకది తెలుసా? మొక్కు మొక్కు గిన్నెను" అన్నడు.

మా సోపతికాని ముంగట తిట్టెనని మొకం మాడ్సుకున్న. అట్లనే నిల్సున్న. "మొక్కొ పో ' అని మల్లోసారి గద్దరిచ్చిండు. నేనింట్లకు పొయ్యి గిన్నెను సెయ్యితోని ముట్టి కండ్లకద్దుకోని అరుగుమీదికచ్చిన. సెంద్రమొగిలికి అక్కెరున్న నా లెక్కలవయ్యిచ్చి ఎల్లగొట్టిన.

అరుగుమీన నాయిన్నకోసురం సూత్తున్న శీనయ్య పంతులు మొకమంత సిన్నవొయ్యింది. శీనయ్య పంతులయ్యోరయినె. పురోయితం జేత్తడు. కనెప్పుడు దరిద్రమే ఎంబడుంటది. అంతకుముందు బాగనే బూములుండె. అన్ని పోగొట్టుకున్నడు. పాలివాళ్ళ తోనెప్పుడు కొట్లాటలే. దండుగలే. ఒగల్లనొగలు బురుదలేసితొక్కుకున్నరు. ఇప్పుడు పొట్టగ్గాడ సరిగ్గ ఎల్లకుంటయిపెయింది. నాయిన్న అన్నం తిని అరుగుమీది కచ్చిండు. శీనయ్య పంతులు పక్కపొంటి మంచంల కూసున్నడు.

"ఏందయ్యగారెందుకో వత్తివి?" అనడిగిండు.

శీనయ్య పంతులు మా నాయిన్నను మామా అని పిలుత్తడు. "ఏం లేదు మామ. కట్టమయిన సుకమయిన నీతోని గాకుంటెవ్వలతోని సెప్పుకుంట నేను! కొంచెమంత పనివడచ్చిన......." అన్నడు శీనయ్య పంతులు.

"ఏంది! ఎట్లనో కనవడ్తన్నవేంది?"

"ఏం జెయ్యన్నే మామ. దరిద్ర దేవత మా కుటుంబాన్నిడిసి పెట్టెటటు లేదు. ఎంత కట్టపడ్డా కని పొట్ట నిండులేదు. రోజురోజుకు బాకీలేమో పెరుగుతన్నయి. ఏం జెయ్యన్నో తెలుత్తలేదే

మామ!"

"ఒగప్పుడు మీ నాయిన్న జమాన్ల[45] ఎట్ల బతికింగ్రు? గిప్పుడెట్లున్నరు. మీమీన రెనిపాడయింది. గనేం గావన్నో సెప్పకనే పోతివి!"

"సిన్నపోల్ల పుట్టింటికెలు తియ్యాలె........ఒక్కిన్నూరు రూపాయలిప్పియ్యి........"

"నా దగ్గరేడియి గని కొమటయినెనడిగి ఇప్పిత్త. సరెగని మొకమంత సిన్నవొయ్యింది. మనుసు మంచిగ లేదా?

తలుకాయూపిండు శీనయ్య పంతులు. "నువ్వింతకు ముందు నీ కొడుకుతోని అన్నం పరబ్రమ్మ రూపంరా తొక్కద్దన్నవు సూడు గా మాటలింటె మా నాయిన్న యాదికచ్చిండే మామ. సచ్చి ఏ స్వర్గంలున్నడో కని అయినెగూడ గిట్లనే అనెటోడు. అప్పుడేం తిండే! నోట్లెకచ్చెరాక తిన్నా గని ఇంకా తినుమెనెటోడు. గిప్పుడు గా తిండిల సగం గూడ దొరుకుత లేదే మామ?" శీనయ్య పంతులు కండ్లల్ల నీల్లూరినయి.

"ఎప్పటి కాలమప్పుడు.......! ఒక్కొక్కలకొక్క కాలముంటది. గప్పుడు దేవుడు మన్నించిండు గట్ల నడ్సింది. మీ నాయిన్న పెయిండు మీ ఇంటికలే పెయింది. కండ్ల నీల్లెందుకు దీసుకుంటవూకో......"

"గప్పటి నా సిన్నప్పటి సంగతులు యాదికత్తె నా పానమంత దరిత్తదే మామ....! మనుసులంత తొలిసినట్టయితది. కండ్లపొంటి నీల్లత్తయి. మా నాయిన్న నన్ను పబోజనాలకు తనతోని తీసుకపోయెటోడు. పక్కపొంటి కూసుండవెట్టి ఇస్తారి నిండన్నం బెట్టి తినుమనెటోడు. సారెడు సారెడు నెయ్యి వోసెటోడు. ఇంకా లడ్డూలు తినుమనెటోడు. నేను బాగ తినన్ననే సూసెటోడు గని అవ్వి నాకు పడుతయో, పట్టయో ఆలోసించకపొయ్యెటోడు. తినకుంటె కొడుతడని బయమాయె. ఎక్కో అయినన్నమేంజెయ్యన్నో తెలువకపోవు. నాయిన్న అటీటు సూసుడు చూసి పెల్లలకు పెల్లలన్నం గోడవతలకిసిరి పారేసెటోన్ని. నాయిన్న సూసెవారకెప్పట్లెక్కనే ఉండెటోన్ని. గట్ల నడ్సింది నా సిన్నప్పటి కాలం.

గిప్పుడు నాకు గా పారేసిన అన్నం గూడ దొరుకుతలేదు. నా పోరగాండ్లకు రొండు పూటల బువ్వ పెట్టుడే కట్టమయితంది. ఓనాడు నేనన్నం ఇసిరేసుడు సూసిండు మా నాయిన్న. బాగ మంటకచ్చిండు. గాడ్దికొడుక....! అన్నం పారేత్తావుర! అన్నమంటేందనుకున్నవురా? పరబ్రమ్మ స్వరూపంరా! అన్నం పారేత్తె అన్నం దొరుకదెరా.....! నీకు గీ పారేసిన అన్నం గూడ కట్టమైతది పో! అని తిట్టుకుంట కట్టందుకొని పాట్టుపాట్టు గొట్టిండు. నాయిన్న గప్పుడన్న మాటలే నిజమైతన్నయే మామ! ఎంగిలి మెతుకులగ్గూడ కరువయితందిప్పుడు!" అని బుజంమీదున్న కండువతోని కండ్లు

తుడుసుకున్నడు నాయిన్న కండ్లల్ల గూడ నీల్లు దిరుగుడు నేం జూసిన.

"నేను చిన్నప్పుడు ఎంత మంచి బట్టలేసుకునోటోన్నో నీకు తెలువదానె. నా పొరగాండ్లకేం జెయ్యలేకపోతన్న. బతుకంటెనే రోత పుడ్తంది" అని భోరుమనేడ్సిండు.

"ఎందుకేడుత్తవు బిడ్డ ఏడ్వకు. కొన్నొద్దులమాస, కొన్నొద్దులు పున్నం" అని నాయిన్న సముదాయించి ఎల్ల గొట్టిండు. పైసలిచ్చిండు.

అయినచ్చి ఊకె కష్టసుఖాలు సెప్పుకునెటోడు.

ఓనాడు ..సున్ముకంతో వచ్చిండు.

"మామా! ఇగ నాకీ ఊర్లోని బాకీ తీరిపెయిందే! పొంగపొంగ మిగిల్న ఒక్క పాల్లాన్నమ్మి పారేసిన పురోయితం పన్తోటి ఒక్కపూటన్న గడుత్తలేదు. మల్ల గి దీనికోసురం పాలోల్లతోని కొట్లాటలు వశెపడుతలేవు. నేనిక్కన్నే ఉంటె పొల్లగాండ్లు సిప్పలు వట్టుకోవల్సచ్చెటట్టున్నది. అందుకోసురమని అత్తగారింటికి పోతన్న. అక్కడ దొరకు శేరిదారుగుంట. ఎట్లనన్న పొల్లగండ్లం జాదుకుంటయిపాయె. ఇక్కడ గా ఇల్లొక్కటే మిగిలింది. గ దాన్ని ఎవ్వలకన్న నువ్వే అమ్మజెప్పు. మల్లెన్నడు కలుసుడయితదో' అని నాయిన్నతోని అలాయిబలాయి తీసుకున్నడు. ఇద్దరి కండ్లల్ల నీల్లు తిరిగినయి.

నేను బల్లె సదివెటప్పుడే శీనయ్య పంతులూల్లెకెల్లి ఎల్లిపోయిండు. కొన్నొద్దులు శేరిదారుగ దొర దగ్గెర పన్జేసి ఏం లాబమనపించలేదట. ఇంకో ఊరికి పెయిండట. గిట్ల ఏడిండ్ల పిల్లికూనోలె తిరిగితిరిగి అలిసిపెయిండయినె. పొల్లగండ్లను పదోటి సదివిచ్చిండు గని ఏం పని గాలేదట. ఆల్ల బామ్మర్ది కల్సి ఓసారి గీ సంగతులన్ని సెప్పిండు.

కడుపునిండ తిండి కోసురమే మొహం వాచిన బతుకు బతికిన శీనయ్యపంతులు ముసలోడైండు. ఎంటికలు పూర్తిగ తెల్లవడ్డయి. మొన్నమొన్ననే కన్నాగురం బస్టాండుల కనవడ్డడు. నన్ను చూసేర్వాటుసేసి దగ్గెరికచ్చిండు. "మంచిగున్నవా బామ్మర్ది. నౌకరి సేత్తన్నవట గద! మా పొరగాండ్లిద్దరవార తిరుగుతుండ్రు. ఏదన్న పని జూడలేవు...." అని బతిమిలాడిండు.

"నా సేతులేముంది......? వీలైతె మా సూత్త" అని కొంతసేపు మాట్లాడి బస్సురాంగనే బస్సెక్కిన. బస్సుల కూసున్న నాకు శీనయ్య పంతులు అలిసిపెయిన మొకమే కండ్లముందు కదులుతంది. ఇసొంటి లక్షలాది మంది శీనయ్య పంతుల్ల ఆకలి దీర్సేటోల్లేరి? అని నా అండ్ల నేను మనాది పడుతుంట.

పూజలు సేస్తూ బతికిన శీనయ్య పంతులుకు తిండే లేక పోవుడు, అన్నం పరబ్రమ్మ స్వరూపమని నమ్మిన అయ్యగారికి కడుపే నిండక పోవుడు నాకు ఆశ్చెర్యమనిపిత్తది. రోజూ పూజజేసే శీనయ్యను ఏ దేవుడూ కండ్లజూడకపోవుడు ఏం మంచిగుంది.......?